నమస్తే తెలంగాణ
జనగామ
5 | వరంగల్, మంగళవారం 25 మార్చి 2025 | JANAGAON

## వచ్చే ఏడాది అందుబాటులోకి

తాడిచెర్ల ఓసీ నుంచి కేటీపీపీ వరకు కన్వేయర్ బెల్ట్ పనులు వచ్చే ఏడాది చివరి కల్లా పూర్తి చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. తాడిచెర్ల నుంచి అటవీ ప్రాంతం గుండా కాశీంపల్లి శివారు, జంగేడు శివారు, సీపల్లి, కొంపెల్లి మీదుగా కేటీపీపీ వరకు బెల్ట్ నిర్మాణం జరగనుంది. అటవీశాఖ అనుమతులు సైతం రావడంతో రోడ్డు పనులు చకచకా జరుగుతున్నాయి. కేవలం కొంపెల్లి , సీపెల్లి గ్రామాల సమీపంలో 3.5 కిలోమీటర్ల పరిధిలో కొన్ని పంటలు ఉండడంతో రైతులు కొంత సమయం అడుగుతున్నారు. మిగిలిన రోడ్డు పనులు దాదాపుగా పూర్తయ్యాయి. దీంతో జయశంకర్ భూపాలపల్లి-పెద్దపల్లి జిల్లాల మధ్య రవాణా సౌకర్యం మెరుగుపడనుంది.


అడవి మధ్యలో జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులు


తాడిచెర్ల ఓసీ వద్ద కన్వేయర్ బెల్ట్ లింక్

# లైన్ క్లియర్!

## తాడిచెర్ల ఓసీ నుంచి కేటీపీపీకి కన్వేయర్ బెల్ట్

**తాడిచెర్ల నుంచి కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్ట్ (కేటీపీపీ)కి కన్వేయర్ బెల్ట్ నిర్మాణానికి లైన్ క్లియరైంది. ఇందుకు సంబంధించి అటవీశాఖ అనుమతులు మంజూరు చేసింది. దీనివల్ల బొగ్గు రవాణా మరింత సులభం కానుంది. నిత్యం వందలాది లారీల ద్వారా బొగ్గు సరఫరాకు బ్రేక్ పడనుంది. ఫలితంగా 40 కిలోమీటర్ల దూరం తగ్గనుండగా, కాలుష్యంతో పాటు రవాణా ఖర్చుకూడా తగ్గనుంది. ఇప్పటికే బెల్ట్ ఏర్పాటు చేసే మార్గంలో రోడ్డు నిర్మాణం చివరి దశకు చేరుకుంది. ఇది పూర్తి కాగానే 19 కిలోమీటర్ల పొడవునా కన్వేయర్ బెల్ట్ పనులకు జెన్‌కో, ఏఎమ్మార్ సంస్థలు శ్రీకారం చుట్టనున్నాయి. కొత్త రహదారి అందుబాటులోకి వస్తే భూపాలపల్లి-పెద్దపల్లి జిల్లాల మధ్య ప్రయాణం మెరుగుపడనుంది.**

**- జయశంకర్ భూపాలపల్లి, మార్చి 24 (నమస్తే తెలంగాణ)**

- ఏర్పాటుకు అనుమతులిచ్చిన అటవీశాఖ
- 19 కిలోమీటర్లు నిర్మించనున్న జెన్‌కో, ఏఎమ్మార్
- ఇప్పటికే చివరి దశకు చేరుకున్న రోడ్డు పనులు
- రోజుకు 7 వేల టన్నుల బొగ్గు రవాణాకు అవకాశం
- లారీల ద్వారా సరఫరాకు పడనున్న బ్రేకులు
- భూపాలపల్లి-పెద్దపల్లి మధ్య మెరుగవనున్న రాకపోకలు

తాడిచెర్ల ఓపెన్‌కాస్టు గని నుంచి కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్టు (కేటీపీపీ)కు ఇక బొగ్గు రవాణా సులభతరం కానుంది. నిత్యం లారీల ద్వారా బొగ్గు రవాణా వల్ల పర్యావరణం దెబ్బ తినడంతో పాటు ట్రాన్స్‌పోర్టేషన్ ఖర్చు అధికంగా ఉంటున్నది. ఈ క్రమంలో పర్యావరణాన్ని పరిరక్షిస్తూ , ఖర్చులను తగ్గించుకోవాలనే లక్ష్యంతో జెన్‌కో, ఏఎమ్మార్ సంస్థలు రూ. 100 కోట్లతో కన్వేయర్ బెల్ట్ నిర్మాణానికి శ్రీకారం చుట్టాయి. తాడిచెర్ల ఓసీ నుంచి కేటీపీపీ వరకు సుమారు 19 కిలోమీటర్ల పొడవున దీనిని ఏర్పాటు చేసేందుకు రోడ్డు పనులు చేపట్టగా ప్రస్తుతం అవి చివరి దశలో ఉన్నాయి. రోడ్డు పూర్తి కాగానే కన్వేయర్ బెల్ట్ నిర్మాణ పనులు ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పుడు తాడిచెర్ల ఓసీపీ నుంచి 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న కేటీపీపీకి ప్రతి రోజు లారీల ద్వారా 7 వేల టన్నుల బొగ్గు రవాణా అవుతున్నది. కన్వేయర్ బెల్ట్ పనులు పూర్తయితే సుమారు 40 కిలోమీటర్ల దూరం తగ్గనుంది. అలాగే ఈ మార్గంలో ప్రజలు తాడిచెర్ల మీదుగా ఇతర ప్రాంతాలకు రాకపోకలు మెరుగుపడనున్నాయి.

### పర్యావరణం సేఫ్

తాడిచెర్ల ఓసీపీ నుంచి 7 వేల టన్నులు, భూపాలపల్లి గనుల నుంచి 6 వేల టన్నుల బొగ్గు ప్రతిరోజు వందలాది లారీల్లో కేటీపీపీకి రవాణా అవుతున్నది. ఈ క్రమంలో ధ్వని, వాహన కాలుష్యంతో పర్యావరణం దెబ్బ తింటున్నది. దీనికి తోడు లారీలో ద్వారా బొగ్గు రవాణాకు ప్రతినెలా రూ. 2 నుంచి రూ. 3 కోట్ల ఖర్చవుతున్నదని అధికారులు చెబుతున్నారు. కన్వేయర్ బెల్ట్ ద్వారా బొగ్గు సరఫరా జరిగితే ఖర్చు తగ్గడమే కాకుండా పర్యావరణం కూడా దెబ్బ తినకుండా ఉంటుందని వారు పేర్కొంటున్నారు.


తాడిచెర్ల నుండి కేటీపీపీకి నిర్మిస్తున్న రోడ్డు


పందినిలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి

## బీఆర్ఎస్ సిల్వర్ జూబ్లీ సభను
# విజయవంతం చేయాలి

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- వర్ధన్నపేట ముఖ్య కార్యకర్తలతో సన్నాహక సమావేశం
- 24గంటల్లో దేవాదుల నీళ్లు ఇవ్వకుంటే ఆందోళన తప్పదని అల్టిమేటం

ఐనవోలు, మార్చి 24 : బీఆర్ఎస్ సిల్వర్ జూబ్లీ వేడుకల సభను విజయవంతం చేయాలని మంత్రి మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. సోమవారం ఐనవోలు మండలం పంథిని గ్రామంలో వర్ధన్నపేట నియోజకవర్గంలోని పర్వతగిరి, ఐనవోలు, వర్ధన్నపేట మండల ముఖ్య కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్‌తో కలిసి ఎర్రబెల్లి హాజరయ్యారు. బీఆర్ఎస్ సిల్వర్ జూబ్లీ వేడుకల సభను విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతీ ఒక్క బీఆర్ఎస్ కార్యకర్తపై ఉందని, సుమారు మూడు మండల నుంచి 20 వేలకు పైగా జనం తరలాలని ఆయన పిలుపునిచ్చారు. మరో 24 గంటల్లో దేవన్నపేట పంప్‌హౌస్ మోటర్లు ఆన్ చేసి దేవాదుల నీరు వదలకపోతే రైతుల పక్షాన నిలిచి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎక్కడికక్కడ ధర్నాలు, రాస్తారోకోలు చేసేందుకు కార్యాచరణ చేపడుతామని ఆయన హెచ్చరించారు. ముఖ్యంగా పాలకుర్తి, జనగామ, స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గాల రైతు సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని కేసీఆర్ పాలనలో రూ.1400 కోట్లు వెచ్చించి ఈ ప్రాజెక్ట్ రూపకల్పన చేసి పూర్తి చేశామన్నారు. 14నెలల కింద అప్పటి ప్రభుత్వమే పంప్‌హౌస్‌ను ప్రారంభించాల్సి ఉండగా ఎన్నికల కోడ్ మూలంగా వాయిదా పడిందన్నారు. పూర్తిస్థాయిలో అందుబాటులోని వచ్చిన ఈ పంప్‌హౌస్‌ను కేవలం పాలకులకు అవగాహన, ఆలోచన లేకనే నీరందించడం లేదని, ఫలితంగా ఆయకట్టు రైతులు లక్షల ఎకరాల్లో యాసంగి పంట నష్టపోయే పరిస్థితి వచ్చిందన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో పంటలు ఎండిపోలేదని రేవంత్‌రెడ్డి వచ్చాక మార్పు చూపిస్తున్నాడని రైతులే అంటున్నారని చెప్పారు. ఇప్పటికే సగం కంటే ఎక్కువగా పంటలు ఎండిపోయాయని మిగిలిన పంటలకైనా నీళ్లిచ్చి కాపాడాలన్నారు. దేవాదుల నీరు వదలాలని బీఆర్ఎస్ నెల రోజులుగా కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నదని ఎండిన అన్ని పంటలకు ఎకరాకు రూ.25 వేలు చెల్లించేవరకూ వదిలేది లేదని స్పష్టంచేశారు. సన్నాహక సమావేశంలో పర్వతగిరి సొసైటీ చైర్మన్ మనోజ్‌గౌడ్, నందనం సొసైటీ వైస్ చైర్మన్ చందర్‌రావు, మాజీ ఎంపీపీ అప్పారావు, మాజీ జడ్పీ కో ఆప్షన్ ఉస్మాన్ అలీ, మాజీ వైస్ ఎంపీపీ మోహన్, మాజీ జడ్పీటీసీ భిక్షపతి, కుమారస్వామి, రాజేశ్వర్‌రావు, నాయకులు కుమార్, అశోక్, సతీశ్, గుంషావళి, రాజు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు పాల్గొన్నారు.

# నాలుగు మోటర్లు తక్షణం ఆన్ చేయాలి



- మిగిలిన 50 శాతం పంటలు రక్షించాలి
- మల్లన్నసాగర్ పనులు వెంటనే చేపట్టాలి
- నీళ్లివ్వకుంటే రూ. 25 వేల పరిహారం చెల్లించాలి
- జిల్లా ఆస్పత్రిలో సీటీ స్కాన్ ఏర్పాటు చేయాలి
- సమస్యలపై అసెంబ్లీలో గళ మెత్తిన ఎమ్మెల్యే పల్లా

జనగామ, మార్చి 24 (నమస్తే తెలంగాణ) : జనగామ నియోజకవర్గ సమస్యలపై స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి సోమవారం అసెంబ్లీలో గళమెత్తారు. జీరో అవర్‌లో ప్రస్తావించి ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. ధర్మసాగర్ రిజర్వాయర్ నాలుగు పంపులను వెంటనే ఆన్ చేస్తే ఎండిపోగా మిగిలిన 50 శాతం పంటలు దక్కుతాయని, మల్లన్నసాగర్ పనులు వెంటనే చేపట్టాలని కోరారు. నియోజకవర్గంలోని తపాస్‌పల్లి, కన్నెబోయినగూడెం, లద్నూరు, బొమ్మకూరు, చీటకోడూరు, గండిరామారం రిజర్వాయర్ల ద్వారా 1.60 లక్షల ఎకరాలకు సాగు నీళ్లంది ఏటా రెండు పంటలు పండాయన్నారు. ఈ యాసంగికి మొదటిసారి 50 శాతం పంటలు ఎండి పోయాయని, మిగతావి చేతి కొస్తాయో లేదో నమ్మకం లేదన్నారు. సమ్మక్కసాగర్ బరాజ్ నుంచి భీంఘన్‌పూర్, చలివాగు ద్వారా దేవాదుల జలాలు ధర్మసాగర్‌కు చేరి అక్కడి నాలుగు మోటర్ల ద్వారా జనగామకు నీళ్లు వస్తాయన్నారు. నాలుగు మోటర్లలో ఒక్క దానిని నడుపుతుండడంతో పంటలు ఎండిపోయాయన్నారు. ధర్మసాగర్‌కు ఫేస్-1, ఫేస్-2 నుంచే కాకుండా అదనంగా ఫేస్-3 ద్వారా 1800 క్యూసెక్కుల నీళ్లు వచ్చేలా దేవన్నపేట వద్ద పంప్‌హౌస్ నిర్మాణం పూర్తయ్యిందన్నారు. ఇందులో ఏర్పాటు చేసిన మూడు మోటర్లను ఆన్ చేయడానికి కష్టపడుతున్నారని అన్నారు. తపాస్‌పల్లికి పైన మల్లన్నసాగర్ ఉందని, గత సర్కారు హయాంలో రూ.350 కోట్ల నిధులిస్తే ఈ ప్రభుత్వం వచ్చాక పనులు ఆపేసిందని, వెంటనే చేపట్టి నీళ్లు ఇవ్వాలని, లేనిపక్షంలో ఎకరానికి రూ. 25 వేల పరిహారం రైతులకు చెల్లించాలని పల్లా డిమాండ్ చేశారు. అలాగే జనగామ, చేర్యాల ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రుల్లో మౌలిక వసతులు కల్పించాలని పల్లా ప్రభుత్వాన్ని కోరారు. జనగామ ఆస్పత్రిలో సీటీ స్కాన్ లేదని, ఇప్పటికే అసెంబ్లీ వేదికగా మూడుసార్లు ప్రభుత్వాన్ని కోరినా ఇవ్వలేదన్నారు. స్కానింగ్ కోసం వరంగల్, హైదరాబాద్‌కు వెళ్లాల్సిన పరిస్థితి ఉందని, జిల్లా ఆస్పత్రిలో మందులు, కనీస సౌకర్యాలు లేవన్నారు.

## పాలేరు వాగుకు
# ఎస్సారెస్పీ జలాలు

**డీబీఎం 60 కాల్వ నుంచి విడుదల**

నమస్తే ఎఫెక్ట్

దంతాలపల్లి, మార్చి 24 : పాలేరు వాగు అడుగంటిపోయిన వైనాన్ని, సాగు నీళ్లు లేక కండ్ల ముందే ఎండిపోతున్న పంటలను కాపాడుకునేందుకు రైతులు పడుతున్న కష్టాన్ని ఇటీవల 'నమస్తే తెలంగాణ' వరుస కథనాలుగా ప్రచురించింది. దీనికి స్పందించిన అధికారులు ఎట్టకేలకు పాలేరు వాగుకు సాగునీరు విడుదల చేశారు. ఎస్సారెస్పీ డీబీఎం 60 కాల్వ నుంచి జలాలు రావడంతో వాగులోని చెక్‌డ్యాంలు నీటితో కళకళలాడుతున్నాయి. పాలేరు వాగులోకి నీళ్లు చేరడంతో మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలంలోని పరీవాహక రైతులు సంతోషంగా తమ పంటలకు పారించుకుంటున్నారు.


పాలేరు వాగుకు వచ్చిన సాగునీరు

# సర్వర్ డౌన్

- పనిచేయని ఎల్ఆర్ఎస్ సైట్
- ఇబ్బంది పడుతున్న దరఖాస్తుదారులు

వరంగల్, మార్చి 24 : ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్ఆర్ఎస్) సైట్ పనిచేయడం లేదు. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇంటర్నర్ సర్వర్ ఎర్రర్ అని వస్తుండడంతో దరఖాస్తులు ఇబ్బంది పడ్డారు. ఈ నెల చివరి వరకు ఎల్ఆర్ఎస్‌పై 25 శాతం రాయితీ ఉండగా, ఫీజుల మదింపు తప్పుల తడకగా ఉందనే ఆరోపణలు వెల్లువెత్తాయి. స్పందించిన ప్రభుత్వం నాలుగు రోజుల క్రితం ఎడిట్ ఆప్షన్ ఇచ్చింది. దీంతో తప్పులు సరిచేసుకునేందుకు వందలాది మంది కార్పొరేషన్‌కు చేరుకొని కౌంటర్ వద్ద బారులుదీరారు. అలాగే మరికొందరు తమకు ఇంటిమేషన్ లెటర్ రాలేదని వచ్చారు. అయితే సర్వర్ డౌన్ కావడంతో ఎల్ఆర్ఎస్ సైట్ ఓపెన్ కాలేదు. దీంతో దరఖాస్తుదారులు గంటల తరబడి కౌంటర్ వద్దే వేచి ఉన్నారు. చివరికి బల్దియా సిబ్బంది డాక్యుమెంట్లు తీసుకుని ఫీజులు అప్‌డేట్ చేస్తామని పంపించారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ డాక్టర్ సత్యశారదాదేవి

## నేటి నుంచి రాష్ట్రస్థాయి రైతు మేళా

- 40 సంఘాల ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలు
- వరంగల్‌లోని నక్కలపల్లిలో ఏర్పాట్లు పూర్తి
- సద్వినియోగం చేసుకోవాలి : కలెక్టర్ సత్యశారదాదేవి

కరీమాబాద్, మార్చి 24 : ఈ నెల 25 నుంచి 27వరకు వరంగల్‌లోని నక్కలపల్లి రోడ్డులో రాష్ట్రస్థాయి రైతు ఉత్పత్తిదారు సంఘాల మేళా నిర్వహించనుండగా వరంగల్ కలెక్టర్ కలెక్టర్ డాక్టర్ సత్యశారదాదేవి సోమవారం ఏర్పాట్లను పరిశీలించారు. స్మాల్ ఫార్మర్స్ అగ్రి బిజినెస్ కన్సార్టియం, రాష్ట్ర వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో మూడు రోజులు ఈ మేళా ఉంటుందని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. 40 రైతు ఉత్పత్తిదారు సంఘాల ఉత్పత్తులతో ప్రదర్శన, అమ్మకాలు ఉంటాయని కలెక్టర్ పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి రైతు ఉత్పత్తిదారు సంఘాల ఉద్దేశ్యం, లక్ష్యాలు, విజయాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పొందే వివిధ బ్యాంకు లింకేజీ పథకాలు, నిష్ణాతులైన శాస్త్రవేత్తల ద్వారా రైతులకు అవగాహన కల్పించనున్నట్లు వివరించారు. రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఇక్కడ అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ పాల్గొన్నారు.

## ఎస్సీ హాస్టల్‌లో పేకాట

- పర్యవేక్షణ లేక పెడదోవన విద్యార్థులు
- అధికారులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల డిమాండ్

జనగామ చౌరస్తా, మార్చి 24 : జనగామ జిల్లా కేంద్రం నడిబొడ్డున ఉన్న ధర్మకంచ ప్రభుత్వ ఎస్సీ వసతిగృహంలో అధికారుల పర్యవేక్షణ లోపంతో విద్యార్థులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. హాస్టల్‌లో చదువుకోవాల్సిన 9వ తరగతి విద్యార్థులు సోమవారం జూనియర్లతో పేకాడుతూ స్థానికులకు కనిపించడంతో వారు మీడియాకు సమాచారమందించారు. ఆ సమయంలో విధుల్లో ఉండాల్సిన హాస్టల్ వార్డెన్ అందుబాటులో లేరని తెలిసింది. పిల్లల్ని ఇంటి దగ్గర చదివించడానికి ఆర్థిక స్థోమత లేని నిరుపేద తల్లిదండ్రులు గంపెడాశతో ప్రభుత్వ వసతి గృహాల్లో చదివిస్తుంటే అధికారుల పట్టింపులేని తనంతో విద్యార్థులు క్రమశిక్షణ తప్పుతున్నారు. భావిభారత పౌరులుగా ఎదగాల్సిన పిల్లలు పెడదోవ పడుతుండడం ఆందోళన కలిగిస్తోంది. వసతి గృహంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరపాలని దళిత, గిరిజన, విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.


హనుమకొండ జిల్లా పరకాలలోని అమరధామంలో నినాదాలు చేస్తున్న ఉద్యమకారులు

## ఉద్యమకారులకిచ్చిన హామీలు నెరవేర్చాలి

**టీయూఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్**

పరకాల, మార్చి 24: ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభు త్వం ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం (టీయూఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఫోరం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉద్యమకారుల చైతన్య యాత్ర పరకాలకు చేరుకుంది. పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ నుంచి అమరధామం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తెలంగాణ ఉద్యమ కారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతి ఉద్యమకారుడికి 250 గజాల ఇంటి స్థలంతో పాటు రూ. 25వేల పెన్షన్ ఇస్తామ ని హామీ ఇచ్చిందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం రేవంత్ రెడ్డి ఉద్యమకారులకు ఇచ్చిన హామీలపై కచ్చితమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. దీంతో పాటు ఉద్యమకారులకు గుర్తింపు కార్డులను అందించి సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. తెలంగాణ ఉద్యమకారులు ఇమ్మిడిశెట్టి రవీందర్, దామెర మొగిలి, ఆలేటి రవీందర్, పసు ల సంజీవయ్య, కుమార్, గజ్జి శంకర్, సురేశ్, సార య్యా, నర్సింహారాములు, ఆరె సాంబరెడ్డి, రామన్న, శ్రీనివాస రెడ్డి, మహేందర్, ఎండీ రఫి, ప్రభాకర్ పాల్గొన్నారు.


అటవీ ప్రాంతంలోని వాగులో చెలిమ నుంచి నీటిని తోడుకుంటున్న గొత్తికోయలు

# చెలిమ నీరే దిక్కు

**తాగునీటికి అల్లాడుతున్న గొత్తికోయలు**

మంగపేట, మార్చి 24: ములుగు జిల్లా మంగపేట మండల కేంద్ర సమీప అటవీ ప్రాంతంలోని శాంతినగర్, పోచమ్మగూడెం గొత్తికోయలకు చెలిమ నీరే దిక్కయ్యింది. అడవుల్లోని తోగులు, కాల్వలు ఎండిపోవడంతో సుమారు యాభై కుటుంబాలు నీటి కోసం గోస పడుతున్నాయి. శాంతినగర్‌గూడెంలో ఉన్న ఒక్కబోరు ద్వారా వస్తున్న కలుషిత నీటిని తాగి అనారోగ్యాల బారిన పడుతున్నారు. పోచమ్మగూడెం సమీపంలోని గౌరారం వాగుకు వెళ్లి చెలిమలు తవ్వి నీళ్లు తెచ్చుకుంటున్నారు. తాగు నీటి కోసం అల్లాడుతుంటే అధికారులెవరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా నీటి గోసను తీర్చాలని కోరుతున్నారు.


పెద్దకుంటపల్లి తండాలో తాగు నీరందించాలని ఖాళీ బిందెలతో ధర్నా చేస్తున్న మహిళలు

## ఖాళీ బిందెలతో మహిళల నిరసన

కృష్ణ కాలనీ, మార్చి 24: భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు పెద్దకుంటపల్లి తండావాసులు తాగు నీటి కోసం సోమవారం ధర్నా చేశారు. ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. మూడు రోజులుగా మిషన్ భగీరథ నీళ్లు రాక తండావాసులు అరిగోస పడుతున్నారు. దూరాన ఉన్న వ్యవసాయ బోరు బావుల వద్దకు వెళ్లి అక్కడే కాలకృత్యాలు తీర్చుకుంటున్నారు. బాటిళ్లు, క్యాన్లలో నీళ్లు తెచ్చుకొని దాహన్ని తీర్చుకుంటున్నారు. తాగు నీటి కోసం ప్రశ్నిస్తే ఎస్టీలైనందుకే మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని, తిడుతున్నారని తండావాసులు ఆవేదన వ్యక్తం చేశారు.

### ఎవరూ పట్టించుకుంటలేరు



మా వాడలో చివరకు 5 నుంచి 6 ఇండ్లు ఉంటాయి. వాటికి మిషన్ భగీరథ పైపులైన్ వేయలేదు. పంపులు బిగించలేదు. అధికారులను ఎన్నిసార్లు అడిగినా పట్టించుకోవడం లేదు. దూరంగా ఉన్న వ్యవసాయ బోరు వద్దకు వెళ్లి మంచి నీళ్లు తెచ్చుకుని తాగుతున్నం. ఇప్పటికైనా మా ఇండ్లకు మిషన్ భగీరథ పైప్‌లైన్ వేసి, నల్లాలు బిగించాలి.

*- గుగులోత్ రమ, పెద్దకుంటపల్లి*

### బయ్యారంలో గాలివాన


*అకాల వర్షం అన్నదాతలను ఆగం చేస్తున్నది. సోమవారం సాయంత్రం ఈదురుగాలులతో వాన పడి మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలో బీరోని, మడవ గ్రామాల్లో మక్కజొన్న నేలవాలింది. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయి.*

*- బయ్యారం, మార్చి 24*

### వాగు అడుగంటి.. పంటలు ఎండిపోయి..


*వరి, మక్కజొన్న చేతికొచ్చే సమయంలో ఆకేరు వాగులో నీరు అడుగంటి పంటలు ఎండిపోతున్నాయి. నర్సింహులపేట మండలంలోని గోల్‌బోడ్కతండా జీపీ పరిధిలోని దూప్యతండా, పత్నితండా, నర్సింహపురం బంజర రైతులు ఎండిపోయిన చేలను పశువులకు మేతగా వదిలేశారు. ఎస్సారెస్పీ నీళ్ల కోసం రూ.50వేల వరకు ఖర్చుచేసినా చుక్క నీరు రాకపోగా ఎండిన బావుల్లో పూడిక తీసినా ఫలితం లేకపోవడంతో పెట్టుబడి కూడా రాదేమోనని ఆందోళన చెందుతున్నారు.*

*- నర్సింహులపేట, మార్చి 24*